సాక్షి
సిద్దిపేట
గురువారం ׀ 21 ׀ ఆగస్టు ׀ 2025



గజ్వేల్ పట్టణంలో యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్న

జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు



సిద్దిపేట మండలం రాఘవాపూర్‌లో రోడ్డుపై బైఠాయించిన రైతులు

కోడికూత కూయగానే పొలం బాట పట్టే రైతన్న.. ఇప్పుడు యూరియా కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం సైతం జిల్లాలో పలు చోట్ల రైతులు యూరియా కోసం ఆందోళనకు దిగారు. పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరారు. సిద్దిపేట రూరల్, దుబ్బాక, గజ్వేల్, మిరుదొడ్డి, హుస్నాబాద్ మండలాల్లో ప్రధాన రహదారులపై బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రోజంతా నిరీక్షించినా రెండు బస్తాలు కూడా లభించడంలేదన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలే నేడు రైతులపై చిన్నచూపు చూస్తున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనలతో రహదారులపై రాకపోకలు స్తంభించిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించి వేశారు.

– సిద్దిపేటరూరల్/దుబ్బాకటౌన్/గజ్వేల్ రూరల్/హుస్నాబాద్/మిరుదొడ్డి(దుబ్బాక)



హుస్నాబాద్ పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద రైతుల నిరీక్షణ



దుబ్బాకలో ధర్నా చేస్తున్న రైతులు

న్యూస్‌రీల్

మల్లన్నసాగర్ టు కొండపోచమ్మ సాగర్

నీటి పంపింగ్ ప్రారంభం



కొండపోచమ్మసాగర్‌లోకి వస్తున్న నీరు

మర్కూక్(గజ్వేల్): భారీ వర్షాల నేపథ్యంలో మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మసాగర్‌కు బుధవారం నీటిపంపింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ సాయిరెడ్డి మాట్లాడుతూ ఒక పంపు ద్వారా ప్రస్తుతం కొండపోచమ్మసాగర్‌లోకి నీటిని పంపింగ్ చేస్తున్నామన్నారు. వరద ఉధృతి మేరకు మిగతా పంపులను కూడా ప్రారంభిస్తామన్నారు. మంగళవారం నాటికి కొండపోచమ్మసాగర్‌లో 4.78 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. 12 టీఎంసీల వరకు పంపింగ్ చేస్తామన్నారు.

ఉత్తమ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆదర్శ, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు అర్హులన్నారు. ప్రధాన ఉపాధ్యాయులు 15 ఏళ్లు, ఉపాధ్యాయులు పదేళ్ల ఉద్యోగ నిర్వహణ చేసిన వారు దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 25లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఆకస్మిక తనిఖీ



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న స్వరూపరాణి

గజ్వేల్: జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి బుధవారం గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్వహణను పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ ఉన్నారు.

విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్టు

సిద్దిపేటరూరల్: 'ఇందిరమ్మ ఇళ్లలో అధికారుల చేతివాటం' అనే శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ స్పందించారు. సంబంధిత అధికారిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి 24 గంటల్లో నివేదిక అందించాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు.

చిన్నకోడూరులో రైలు కూత



చిన్నకోడూరుకు వచ్చిన రైలు

చిన్నకోడూరు(సిద్దిపేట): రైల్వే లైన్‌పై ఆ శాఖ అధికారులు బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్ పనుల్లో భాగంగా ట్రయల్ రన్ చేపట్టారు. మొదటి సారి రైలు కూత వినిపించడంతో స్థానికులు సెల్ఫీలు దిగారు. చిన్నకోడూరుకు రైలు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

చరిత్ర చెరిపేసేందుకు కుట్రలు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఆంక్షారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్: ప్రపంచ దేశాల్లో భారత్‌ను తలెత్తుకునేలా చేసిన దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ చరిత్రను చెరిపేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు కుట్రలు చేస్తున్నదని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఆరోపించారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గజ్వేల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ సాంకేతిక రంగాలకు పెద్ద పీట వేశారని కొనియాడారు.

ముఖం చూపని ఉపాధ్యాయులు





ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్‌పై అనాసక్తి

- ఈ నెల 18న వినియోగించుకోని 700 మంది
- ఆలస్యంగా వచ్చిన వారు సైతం అదే దారిలో..
- జిల్లా వ్యాప్తంగా 5,649 టీచర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్

ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ యాప్ ద్వారా అటెండెన్స్‌ను నమోదు చేసుకునేందుకు పలువురు ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదు. దుమ్మాలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశ్యంతో విద్యాశాఖ ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తీసుకువచ్చిన విషయం విదితమే. ఈ నెల ఒకటి నుంచి ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను అమలు చేస్తున్నారు. ఒక్కరోజే 700 మంది ఉపాధ్యాయులు యాప్ ద్వారా అటెండెన్స్ వేసుకోకపోవడం గమనార్హం. ఎఫ్ఆర్ఎస్‌లో పలు కఠిన చర్యలు తీసుకుంటేనే ఉపాధ్యాయులు గాడిలో పడే అవకాశం ఉంటుందన్న చర్చ జరుగుతోంది. – సాక్షి, సిద్దిపేట

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరుపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. బోధనా తరగతులు సమతుల్యంగా జరగడంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచి, ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని భావిస్తోంది. పలువురు ఉపాధ్యాయులు విధులకు దుమ్మా కొడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విద్యాశాఖ గుర్తించింది. దీంతో క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరై కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్ అటెండెన్స్‌ను అమలు చేస్తోంది.

5వేల మందికి పైగా ఉపాధ్యాయులు

జిల్లా వ్యాప్తంగా 1,021 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 5,649 మంది ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు. వారిలో 5,555 మంది ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. మరో 94 మందిలో ఇతర దేశాలకు వెళ్లిన వారు 63 మంది వరకు ఉండగా 31 మంది వివిధ కారణాలు చెబుతూ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం లేదు. ఉపాధ్యాయుడు, నాన్‌టీచింగ్ సిబ్బంది సదరు పాఠశాలకు 500మీటర్ల లోపు ఉంటేనే ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తీసుకుంటుంది.

యాప్‌పై కానరాని ఆసక్తి

ఈ నెల 18న 700 మంది ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్ ద్వారా అటెండెన్స్‌ను వేసుకోలేదు. ఇందులో కొంత మంది సెలవులు పెట్టినా హెచ్ఎం ఆమోదం తెలపకపోవడంతో వారందరికీ గైర్హాజరుగా నమోదైంది. మరికొందరు పాఠశాలకు ఆలస్యంగా రావడంతో ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు చేసుకోలేదు. పాఠశాలకు ఆలస్యంగా వచ్చినట్లు తెలిసిపోతుందని అటెండెన్స్ వేసుకోవడంలేదు. వర్కింగ్ డేస్‌లలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4:15గంటల వరకు పాఠశాలలోనే ఉపాధ్యాయులు ఉండాలి. కొందరు ముగింపు సమయం కంటే ముందే వెళ్తుంటారు. అలాంటి వారు సైతం ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు చేసేందుకు మొగ్గు చూపడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా అటెండెన్స్‌ను వేయని వారిని మొదటే గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటే అందరూ క్రమం తప్పకుండా వినియోగించుకుంటారన్న చర్చ జరుగుతోంది. నిర్దేశిత సమయంలో పాఠశాలలోనే ఉండి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అభిప్రాయ పడుతున్నారు.

వారిపై చర్యలు తప్పవు



హాజరైన ప్రతి రోజు అటెండెన్స్ ఎఫ్ఆర్ఎస్ ద్వారానే నమోదు చేసుకోవాలి. యాప్‌ను ఉపయోగించని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు. అందరూ సమయపాలన పాటించాలి. మరో వారం రోజుల్లో ట్రయల్ రన్ ముగియనుంది. కొన్ని చోట్ల టెక్నికల్ సమస్య వస్తుంది. పరిష్కారం చేస్తున్నాం. – శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ

యూరియా ఇవ్వకుండా కేంద్రం నాటకాలు

- కొరతకు కారణం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్
- దుబ్బాకలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్

దుబ్బాక: రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రప్రభుత్వమే కారణమని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ మండిపడ్డారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కార్యకర్తల కష్టసుఖాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి సరిపడా యూరియా ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాటకాలు చేస్తోందన్నారు. 7 లక్షల టన్నుల యూరియా ఇవ్వాల్సి ఉంటే కేవలం 4 లక్షల టన్నులే ఇచ్చిందన్నారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమేనన్నారు. కానీ కొన్నిపార్టీల నాయకులు కావాలనే యూరియాను బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టించి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. యూరియా కొరత ఉంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇక్కడ ధర్నా చేయడం ఏమిటని దమ్ముంటే ఢిల్లీలో చేయాలన్నారు. యూరియా కొరతపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెస్తూ.. తెప్పించేందుకు కృషిచేస్తున్నామన్నారు. సన్న వడ్ల బోనస్ డబ్బులు వచ్చే నెలలో వేయడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని ఇప్పుడు అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వడం జరుగుతోందన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి పదవి నా బాధ్యత

మాజీ మంత్రి ముత్యంరెడ్డి తనయుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డికి పదవి ఇప్పించే బాధ్యత నాదేనని మంత్రి వివేక్ అన్నారు. సముచితమైన పదవి ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేస్తాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అసంపూర్తిగా ఉన్న రహదారులను పరిశీలించి పూర్తి చేస్తామని, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్ వెళ్తూ సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీని అభివృద్ధి చేస్తూ, వచ్చే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ హరికృష్ణ, సిద్దిపేట పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్, సందబోయిన పర్శరాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగిరం చేయండి

- కలెక్టర్ హైమావతి
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్: నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగిరం చేయాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈజీఎస్ కింద చేపడుతున్న పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్ర భవనాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా పోతారం(ఎస్), పందిల్ల, జిల్లెల్లగడ్డ, సముద్రాల, బస్వాపూర్ వద్ద సెంట్రల్ లైటింగ్ పనులు చేయాలని సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ పనులు, బతుకమ్మ ఘాట్‌ను బతుకమ్మ పండుగ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. హుస్నాబాద్‌లో ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని పక్కా ప్రణాళికతో నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా హౌసింగ్ అధికారులు సందర్శించాలన్నారు. మున్సిపల్ పరిధిలో వన మహోత్సవం టార్గెట్ పూర్తి చేసి, రహదారుల వెంబడి రావి, మర్రి, వేప చెట్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నంగునూరు(సిద్దిపేట): వరద నీటి ప్రవాహం నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో చెక్‌డ్యామ్, వాగుల్లో సమస్యలు రాకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. బుధవారం నంగునూరు మండలం పరిధిలోని మోయతుమ్మెద వాగు ఘనపూర్, ఖాతా ప్రాంతాల్లో చెక్ డ్యామ్‌లను పరిశీలించారు. పది రోజులుగా చెక్ డ్యామ్ ద్వారా నీటి ప్రవాహం ఉంటోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అప్రమత్తంగా ఉండేలా ప్రజలను చైతన్యం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

రేపు 'పనుల జాతర'

సిద్దిపేటరూరల్: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 22న శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'పనుల జాతర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ హైమావతి అన్నారు. బుధవారం సంబంధిత అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

డీలర్ల పరేషన్!

కమీషన్ కోసం ఎదురుచూపులు

- ఐదు నెలలుగా పెండింగ్
- జిల్లాలో రూ.3కోట్ల బకాయిలు
- కొత్త నిబంధనలతో అయోమయం



సిద్దిపేటజోన్: లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించిన డీలర్లు సంబంధిత కమీషన్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఐదు నెలలుగా కమిషన్ డబ్బులు రాకపోవడంతో దిక్కుతోచనిస్థితికి గురవుతున్నారు. రేషన్ డీలర్లకు క్వింటాలుకు రూ.140 చొప్పున ప్రభుత్వం కమీషన్ చెల్లిస్తోంది. ఈ లెక్కన జిల్లాలోని డీలర్లకు ఐదు నెలలకు సంబంధించి రూ.3 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. గతంలో ఉన్న నిబంధనలను సవరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కమిషన్ డబ్బులు జమ చేసే విధానం రావడంతో కొంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

జిల్లాలో 685 రేషన్ షాప్‌ల ద్వారా 2,98,985 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా దాదాపు 5వేల మెట్రిక్ టన్నులపై చిలుకు రేషన్ బియ్యం సరఫరా అవుతోంది. అందుకు సంబంధించి ఆయా రేషన్ షాప్ నిర్వహకులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.140 చొప్పున కమిషన్ చెల్లిస్తుంది. జిల్లాలో 685 రేషన్ డీలర్లకు 51 వేల క్వింటాళ్ల బియ్యం పంపిణీకి సంబంధించి ప్రతి నెలా సుమారు రూ.71లక్షల పై చిలుకు కమిషన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. గత మార్చి వరకు సజావుగా కమిషన్ డబ్బులను బ్యాంకులో జమ చేసింది. కాగా ఏప్రిల్, మే నెలలకు సంబంధించి కమిషన్ డబ్బులు పెండింగ్‌లో ఉండడం మరోవైపు ఇటీవల జూన్‌లో మూడు నెలల బియ్యాన్ని డీలర్లు ఒకేసారి పంపిణీ చేశారు. దీనితో మొత్తంగా ఐదు నెలల కమిషన్ డబ్బులు పెండింగ్‌లోపడ్డాయి.

మారిన నిబంధనలతో..

గతంలో ప్రజా పంపిణీ వ్యవస్థ డీలర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన కమీషన్ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే జమ చేసేది. కానీ ఇటీవల నిబంధనలను సవరించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేరువేరుగా డీలర్లకు కమిషన్ డబ్బులు జమ చేస్తున్నాయి. కమిషన్ డబ్బుల జమ అంశంపై డీలర్లకు అయోమయ పరిస్థితి నెలకొంది.

ఆర్థిక ఇబ్బందుల్లో డీలర్లు

ఐదు నెలలుగా కమీషన్ డబ్బులు జమ చేయకపోవడంతో డీలర్లు ఆర్థిక పరమైన ఇబ్బందులు పడుతున్నారు. షాప్ కిరాయి, లబ్ధిదారులకు బియ్యం అందించడానికి అవసరమైన సిబ్బంది జీతం, ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి లారీల్లో వచ్చిన బియ్యాన్ని రేషన్ షాప్ లో దిగుమతి చేసిన హమాలీలకు చార్జీల చెల్లింపు తదితర ఆర్థిక పరమైన అంశాల్లో డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వెంటనే జమ చేయాలి



కొన్ని నెలలుగా ప్రభుత్వం కమీషన్ డబ్బులు జమ చేయడం లేదు. ఇప్పటివరకు ఐదు నెలలుగా బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రతి నెలా ఒకటవ తేదీనే కమీషన్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కమీషన్‌ను పెంచాలి.

– నాగరాజు, రాష్ట్ర డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో రాణించిన విద్యార్థులు

హవేళిఘణాపూర్(మెదక్): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా హవేళిఘణాపూర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం కరుణాకర్ తెలిపారు. రన్నింగ్ -600 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నవీన్, షాట్‌పుట్ అండర్-18 విభాగంలో ద్వితీయ స్థానంలో రోహిత్, అండర్ -14 విభాగంలో 60 మీటర్ల రన్నింగ్‌లో శైలజ తృతీయ స్థానంలో నిలిచారు. మెడల్స్ సాధించినందుకు పీడీ మధుమోహన్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న యాదగిరి

హత్నూర(సంగారెడ్డి): కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వడం లేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ పరిశ్రమల వద్ద సర్వే నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు పరిశ్రమల్లో 10 నుంచి 12 గంటలు పని చేయించుకుంటున్నారని తెలిపారు. ఈఎస్ఐ, పీఎఫ్ ,యూనిఫామ్, మంచినీళ్లు , వాష్ రూమ్ తదితర సౌకర్యాలు ఏ పరిశ్రమ కూడా కల్పించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీరేశం, శేఖర్, మహేశ్, సురేశ్ ,ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

జహీరాబాద్ టౌన్: అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ చెక్‌పోస్టు అధికారులు బుధవారం పట్టుకున్నారు. వివరాలు ఇలా.. రాష్ట్ర సరిహద్దులో గల మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఎస్ఐ.కోటేశ్వర్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో వాహనాల్లో తరలిస్తున్న వివిధ బ్రాండ్స్‌కు చెందిన ఎనిమిది గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ నవీన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితుడ్ని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మునిపల్లి(అందోల్): 65వ నంబర్ జాతీయ రహదారిపై ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ వివరాల ప్రకారం... బుధవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. కరీంనగర్‌కు చెందిన తాజ్ మహమ్మద్ కర్నాటక ఆర్టీసీ బస్సులో బీదర్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా 440 గ్రాముల ఎండు గంజాయిని తీసుకొస్తుండగా పట్టుకున్నారు. గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మహమ్మద్‌పై కేసు నమోదు చేసి సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్ఐ అనిల్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్, అలీం , కానిస్టేబుల్ యాదయ్య, కరీం పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

- ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డుపక్కన బోల్తా పడిన కారు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని పుట్టగూడెం గ్రామానికి చెందిన యాదవత్తు రవి తన కూతురిని కళాశాలలో దించి రావడానికి షిఫ్ట్ కారులో వెళుతున్నారు. దౌలాపూర్ గ్రామ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు కిందకు వెళ్లి బోల్తా పడింది. దీంతో రవితో పాటు కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సింగూరు నుంచి నీటి కేటాయింపులు ఇలా..

హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లయ్	మిషన్ భగీరథ తాగునీటి పథకానికి..	కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టుకు	ఘనపురం ఆనకట్టకు..	సింగూరు కాలువలకు
6.96 టీఎంసీలు	5.70 టీఎంసీలు	8.35 టీఎంసీలు	4.06 టీఎంసీలు	2.00 టీఎంసీలు

హైదరాబాద్‌కు తాగునీరెట్లా?

ప్రశ్నార్థకంగా మారిన ప్రత్యామ్నాయం.!

- సింగూరును ఖాళీ చేస్తున్న నీటి పారుదల శాఖ
- డెడ్ స్టోరేజీకి సర్కారుకు ప్రతిపాదనలు
- 16.5 టీఎంసీలకు తగ్గించేందుకు అనుమతి
- తక్షణమే ఖాళీ చేసి మరమ్మతులు చేయాలి : ఎన్‌డీఎస్‌ఏ



సింగూరు ప్రాజెక్టు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : సింగూరు ప్రాజెక్టును ఖాళీ చేస్తే హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయం ఎలా అనే అంశం తెరపైకి వస్తోంది. నగరానికి తాగునీటి సరఫరాలో ఈ జలాశయమే కీలకం. హెచ్ఎండబ్ల్యూఎస్ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్) ఇక్కడి నుంచి ప్రతిరోజు 120 మిలియన్ గ్యాలెన్ల తాగునీరు హైదరాబాద్‌కు సరఫరా చేస్తోంది. నగరంలోని గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, బంజారాహిల్స్, టోలీచౌక్ (పాక్షికంగా), హఫీజ్‌పేట్, హైదర్‌నగర్, లింగంపల్లి, రామచంద్రాపురం, పటాన్‌చెరుకు ప్రాంతాలకు ఇక్కడి నుంచే పంపింగ్ జరుగుతోంది. ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికల నేపథ్యంలో ఇప్పుడు ఈ ప్రాజెక్టును ఖాళీ చేస్తే ఈ ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆ సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి.

డెడ్ స్టోరేజీ కోసం ప్రతిపాదనలు

ఈ జలాశయం కట్ట పూర్తిగా దెబ్బతిన్నదని డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇటీవల హెచ్చరించిన సంగతి తెలిసిందే. తక్షణం కట్ట రివిట్‌మెంట్‌కు మరమ్మతులు చేయని పక్షంలో డ్యామ్ తెగిపోయి భారీ నష్టం వాటిల్లుతుందని నివేదిక ఇచ్చింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో నీటిపారుదల శాఖ ప్రాజెక్టులోని నీటిని ఖాళీ చేస్తోంది. ఇటీవల కురిసిన వర్షంతో వచ్చిన వరదతోపాటు, ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని కూడా దిగువకు వదిలేస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.9 టీఎంసీలు. వారం రోజుల క్రితం 22.2 టీఎంసీలు నీరు ఉండేది. ఇప్పుడు ఈ నీటి నిల్వను 18.6 టీఎంసీలకు తగ్గించారు. 16.55 టీఎంసీలకు తగ్గించేందుకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి అనుమతి ఉంది. తాజాగా డెడ్ స్టోరేజీ (1.5 టీఎంసీల)కు తగ్గించేందుకు అనుమతి మంజూరు చేయాలని జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రాజెక్టును డెడ్‌స్టోరేజీ చేసి రూ.16.08 కోట్లతో మరమ్మతు పనులు చేస్తామని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉందని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

మిషన్ భగీరథకు సైతం..

సంగారెడ్డితోపాటు, మెదక్ జిల్లాలో కొన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న భగీరథ తాగునీటి పథకాలకు సింగూరు ప్రాజెక్టే ఆధారం. ఈ తాగునీటి పథకాల కోసం రోజుకు 120 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా అవుతోంది. ప్రధానంగా సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాలతో పాటు, మెదక్ జిల్లాల్లో కొన్ని గ్రామాలకు ఈ ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. ప్రాజెక్టును ఖాళీ చేస్తే పాత తాగునీటి పథకాలతోపాటు, బోర్లే ఆధారం కానున్నాయి.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి జోన్: రిఫ్రెష్మెంట్ కోర్సులో భాగంగా జిల్లా నుంచి వచ్చే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన సందర్శించి, బ్యారెక్స్, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందించేలా నూతన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రిల్ ప్రాక్టీస్, రెగ్యులర్ పరేడ్‌లో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫిజికల్ ట్రైనింగ్, లా క్లాస్‌లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట జిల్లా డీఐఈఓ రవీందర్ రెడ్డి



డిజిటల్ క్లాస్‌లను పరిశీలిస్తున్న డీఐఈవో

సిద్దిపేట ఎడ్యుకేషన్ : జేఈఈ, నీట్, ఈఏపీసెట్ ఎంట్రెన్స్‌లకు హాజరయ్యే విద్యార్థులు ఫిజిక్స్ వాలా ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆయన ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించి ఆన్‌లైన్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోజు వారి తరగతులతో పాటు, ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని అధ్యాపకులను ఆదేశించారు. డిజిటల్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

మా హయాంలో యూరియా కొరత లేదు

చేర్యాల కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పల్లా



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు, నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కేసీఆర్ పాలనలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదని, ముందుచూపుతో యూరియా కొరత లేకుండా చేశారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. కొద్ది రోజుల క్రితం ఆయన కాలుకు గాయం కావడంతో శస్త్ర చికిత్స చేయించుకుని నయం అయిన వెంటనే బుధవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చారు. ఆయనకు కార్యకర్తలు కొమురవెల్లి పాత కమాన్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు నింపి రైతులకు నీరు అందించామని తెలిపారు. కాళేశ్వరం రిజర్వాయర్‌పై జస్టిస్ ఘోష్ ఇచ్చిన నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి అబద్దంగా ప్రచారం చేస్తూ కేసీఆర్, హరీశ్‌రావులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచంలోనే ఎత్తైన, తక్కువ సమయంలో పూర్తి చేసిన కాళేశ్వరం రిజర్వాయర్ రెండు పిల్లర్లు కుంగితే వాటిని బాగు చేసి రైతులకు నీరు అందివాల్సింది పోయి, విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంపై వివాదం

ఇరువర్గాల మధ్య తోపులాట

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌లో పీఏసీఎస్ భవనం చుట్టు ప్రహరీ గోడ నిర్మాణం విషయమై బుధవారం వివాదం నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. వివరాలు ఇలా... పీఏసీఎస్‌లో ఉన్నా నిధులతో గోడ నిర్మాణ పనులు చేపట్టేందుకు చైర్మన్ కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో భూమి పూజ చేస్తుండగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. నిధులు దుర్వినియోగం జరగకుండా పనులు చేపట్టవద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామస్తులు జిల్లా అధికారులకు విన్నవించారు. పనులు చేపట్టవద్దని జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు సైతం జారీ చేశారు. భూమి పూజ చేస్తుండగా కాంగ్రెస్ నాయకులు, కొందరు గ్రామస్తులు అక్కడికి చేరుకోగా వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రహరీ గోడ నిర్మాణం పనులకు బ్రేక్ పడింది.

పుస్తెలతాడు చోరీకి యత్నం

సిద్దిపేటకమాన్: మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు చోరీకి యత్నించిన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన అప్పిస యాదవ్వ (38) స్థానిక శ్రీ కృష్ణాయాదవ ఫంక్షన్‌హాల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తోంది. రోజు మాదిరిగానే ఆమె మంగళవారం రాత్రి విధుల్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి లోపలికి వచ్చి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు దోచుకెళ్లడానికి ప్రయత్నించాడు. దీంతో అప్రమత్తమై ఆమె కేకలు వేయగా పక్కనే ఉన్న మరో ఫంక్షన్ హాల్ వాచ్‌మెన్ వచ్చి దుండగుడిని పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయాడు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హుండీని ఎత్తుకెళ్లిన దుండగులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మల్లన్న గుడిలో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. అందులో సుమారుగా రూ. ఐదు వేలు నగదు ఉందని నిర్వాహకులు ఎస్ఐ బాల్‌రాజ్‌కు తెలిపారు. సీసీ కెమెరాలో నిందితులకు సంబంధించి ఆనవాళ్లు సమోదయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో నిందితులను అరెస్ట్ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



తాజుద్దీన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కేసీఆర్‌నగర్‌లో నివాసముండే షేక్ తాజుద్దీన్ కొంతకాలం ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంపై గతంలో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. కాగా ఈ నెల 18న ఎవరికీ చెప్పకుండా తాజుద్దీన్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో అతని ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు. అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్టీయూటీఎస్ ఉద్యమ బాట

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ఆరోపించారు. అక్టోబర్ 12న లక్ష మందితో ఛలో హైదరాబాద్ పేరిట 'జంగ్ సైరన్' నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించి బుధవారం మెదక్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్, కిష్టయ్య, జబ్బార్, అరుణ్, దిలీప్, వేణుగోపాల్, మహేశ్వర్, ఎల్లం, రవి, రావినాయక్, మల్లేశ్, శ్రీధర్, దుర్గారాములు పాల్గొన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ గోడ

- తప్పిన ప్రమాదం



కూలిన దొడ్లపల్లి పాఠశాల ప్రహరీ గోడ

దుబ్బాకటౌన్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాయపోల్ మండలం దొడ్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ బుధవారం కూలిపోయింది. కూలినప్పుడు సమీపంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రహరీ గోడ లేకపోతే పాఠశాలకు రక్షణ లేకుండా పోతుందని, చుట్టుప్రక్కల వ్యవసాయ పొలాలు ఉండటంతో క్రిమి కీటకాలు, పాములు లోనికి వచ్చే అవకాశముందని తల్లిదండ్రులు భయందోళనకు గురవుతున్నారు. వెంటనే ప్రభుత్వం శిథిలాలను తొలగించి గోడను నిర్మించాలని కోరుతున్నారు.



మట్టిరోడ్డు పై గుంతలో నీరు నిలువడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ఖాజీపేట తండాకు రాకపోకలు బంద్

- వర్షంతో కొట్టుకుపోయిన మట్టి రోడ్డు
- ఐదు రోజులుగా గిరిజనులకు ఇబ్బందులు



కోతకు గురైన ఖాజీపేట గిరిజన తండా రోడ్డు

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఖాజీపేట గిరిజన తండాకు ఐదో రోజులుగా రాకపోకలు బంద్ అయ్యాయి. భారీ వర్షాలతో తండాకు వెళ్లే మట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. రెడ్డిపల్లి - ఖాజీపేట టీడబ్ల్యూ రోడ్డు నుంచి గిరిజన తండా వరకు సుమారు మూడు కిలోమీటర్లు మట్టి రోడ్డు ఉంది. ఈ రోడ్డు పక్క నుండి కాళేశ్వరం ప్రాజెక్టు కాలువ ఉండటంతో పాటు మరోపక్క వాగు ఉండటంతో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు కోతలకు గురైంది. దీంతో స్కూల్ పిల్లలతో పాటు గిరిజనులు నిత్యావసర సరుకులు, ఆస్పత్రులకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. కాళేశ్వరం కాలువతోనే తమ రోడ్డు కుంగిపోయి గుంతలు ఏర్పడుతున్నాయని తండా గిరిజనలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కాలేశ్వరం ఏఈ డబ్ల్యూఓ. సుజాతరాణిని వివరణ కోరగా తండా రోడ్డుకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

సాగుపై క్షేత్రస్థాయిలో విద్యార్థుల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న విద్యార్థులు

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని పన్యాల గ్రామంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ సాగును రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు బుధవారం పరిశీలించారు. గ్రామీణ కృషి అనుభవం కారక్రమంలో భాగంగా విద్యార్థులు వంశీ, మణికంఠ, సాయి శివనాథ్, అనిల్ గ్రామీణ వ్యవసాయ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు డా. అరుణ, డా.రాహుల్, డా.నిర్మల పాల్గొన్నారు. విద్యార్థులు గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను గ్రామ పటం, చిత్రాల రూపంలో ప్రదర్శించారు. రైతులు టి.బుచ్చి రెడ్డి, డి.విఠల్, బషీర్, శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ రమేశ్, గ్రామ కార్యదర్శి శ్వేత, స్థానికులు అరుణ్ కాంత్ రెడ్డి, సతీశ్, శంకర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పురాతన భవనం కూల్చివేత



పురాతన భవనాన్ని కూల్చివేస్తున్న జేసీబీ

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రంలో సుమారు 150 సంవత్సరాల క్రితం ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయ ఆవరణలో నిర్మించిన పురాతన భవనం శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భవనం ఓ పక్క కూలిపోవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామపంచాయతీ అధికారుల ఆదేశాలతో భవన యజమాని కూల్చివేత పనులు ప్రారంభించారు. కొన్ని ఏళ్ల పాటు ఓ వైపు కుటుంబం నివాసం ఉండటంతో పాటు అప్పట్లో పోలీస్ స్టేషన్, ఆ తర్వాత బీసీ సంక్షేమ వసతి గృహం కొనసాగింది. అనంతరం సినిమా ప్రదర్శనలతోపాటు ప్రైవేటు కార్యాలయాలు కొనసాగాయి.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం

ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి

దుబ్బాకటౌన్: గ్రామాల్లో ఉండే ప్రజలందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం చేపట్టిందని ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా చేసేందుకు వాలంటరీ టీచర్లను ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 23న వాలంటరీ టీచర్లకు గ్రామస్థాయిలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి సెప్టెంబర్ 8న ఉల్లాస్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తామని తెలిపారు. ఉల్లాస్ ముఖ్య ఉద్దేశం 2030 వరకు భారతదేశంలో నిరక్షరాస్యులు లేకుండా 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సత్యనారాయణ రెడ్డి, ఆర్పీలు, ఉపాధ్యాయులు, వీవోఏలు తదితరులున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తూప్రాన్: ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గజ్జెల సంధ్య(34) కుటుంబ పోషణ భారం కావడంతో మానసికంగా బాధపడుతూ ఈనెల 13న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కాగా మృతురాలి భర్త ఇటీవల అప్పుల బాధతో ఊరివేసుకొని మృతి చెందాడు. దీంతో ఇద్దరు కుమారులు అనాథలయ్యారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

జిన్నారం (పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన గొల్ల శ్రీకాంత్ (27) స్వస్థలం మెదక్ జిల్లా హనుమంతాపూర్. సోమవారం తన స్నేహితులు ప్రకాశ్, బబ్లూతో కలిసి ఇంటి నుండి బయటకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు శ్రీకాంత్ ఇంటికి రాకపోవడంతో స్నేహితులను అడగగా మాకు తెలియదని చెప్పారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం నారాయణ కాళాశాల వెనుక భాగంలోని గుంతలో అనుమానాస్పద స్థితిలో ఓ శవం లభ్యమైంది. పోలీసులు శ్రీకాంత్‌గా గుర్తించారు. తన తమ్ముడి మృతికి స్నేహితులే కారణమని అన్న రమేశ్ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇల్లు ఖాళీ చేయించిన ఆర్ఐ

కుటుంబ సభ్యులతో కలిసి కనిపించకుండా పోయిన ముంపు బాధితుడు



ఆర్‌అండ్ఆర్ కాలనీ(ఏటిగడ్డ కిష్టాపూర్)లో చంద్రం కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్ఐ



చంద్రం నివసిస్తున్న ఇంటివద్ద నెలకొన్న ఉద్రిక్తత

గజ్వేల్‌రూరల్: ఇంటి మరమ్మతులకు పెట్టిన డబ్బులను చెల్లిస్తేనే ఖాళీ చేస్తామంటూ మల్లన్నసాగర్ ముంపు గ్రామానికి చెందిన ఓ భూ బాధితుడు తాను ఉంటున్న ఇంటిని ఖాళీ చేయించేందుకు వచ్చిన అధికారులతో ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ ఇంటిని వేరొకరికి కేటాయించగా కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చిన ఆర్ఐ ఇంటిని ఖాళీ చేయించగా సదరు కుటుంబ సభ్యులు రోడ్డెక్కి కనిపించకుండా పోవడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన బుధవారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన అరికెల చంద్రంకు పునరావాసం ప్యాకేజీ కింద ప్లాటును ఎంచుకోగా, ఆర్‌అండ్ఆర్ కాలనీలో ఓ అసంపూర్తి నిర్మాణ ఇంటిలో ఉంచారు. తిరిగి కొద్ది రోజుల తర్వాత తనకు ఇల్లు కావాలంటూ ప్యాకేజీ కింద వచ్చిన రూ.5లక్షలను తిరిగి ప్రభుత్వానికే డీడీ కట్టినప్పటికీ, ఇళ్ల ఇవ్వలేమంటూ అధికారులు ఆ డీడీని తిరిగి చంద్రంకే చెల్లించారు. ఎలాగైనా అధికారులు తనకు ఇళ్ల కేటాయిస్తారనే ఆశతో చంద్రం తాత్కాలికంగా నివాసముంటున్న ఇంటికి రూ.13లక్షలు చెల్లించి మరమ్మతులు చేయించుకున్నాడు. ఈ క్రమంలో చంద్రం ఉంటున్న ఇంటిని అధికారులు మాధవరెడ్డి అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో మాధవరెడ్డి ఇంటిని ఖాళీ చేయాలని చంద్రంను కోరగా.. తాను ఇంటి మరమ్మతులకు పెట్టిన డబ్బులను చెల్లిస్తే వెళ్ళిపోతామని చంద్రం పేర్కొనడంతో నిరాకరించిన మాధవరెడ్డి కోర్టును ఆశ్రయించి తనకు ఇంటిని అప్పగించాలని ఉత్తర్వులు తెచ్చుకున్నాడు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్డీవో, తహశీల్దార్ ఆదేశాల మేరకు గజ్వేల్ ఆర్ఐ కృష్ణ బుధవారం రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సాయంతో చంద్రం ఇల్లు ఖాళీ చేయించేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఉన్నఫలంగా ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికి వెళ్లేది, తమకు న్యాయం చేయాలంటూ చంద్రం కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది, పోలీసులు చంద్రం కుటుంబ సభ్యులను ఇల్లు ఖాళీ చేయించి మాధవరెడ్డికి తాళాలను అప్పగించారు. ఈ క్రమంలో చంద్రం తన భార్య లావణ్య పిల్లలతో కలిసి కనిపించకుండా పోయాడు. గ్రామ మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డితో పాటు చంద్రం బంధువులు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు.